# ఏవి భాగ్యాలు?

ముద్దంశెట్టి హనుమంతరావు

హరి వుద్యోగంలో చేరినప్పటికి, చాలా బుద్ధిమంతుడు, సిగరెట్ కాల్చేవాడు కాదు. కిళ్ళీ వేసేవాడు కాదు. ఎప్పుడో తప్పించి, సినిమా చూసేవాడు కాదు. ఈ నవీన యుగంలో యింత బుద్ధిగా వుండే కుర్రాళ్ళు చాలా అరుదేనని, అందరూ హరిని తెగమెచ్చునేవారు.

హరి, సత్యవతిని పెళ్ళి చేసుకున్నాడు హరికి, ఆమె అన్నివిధాలా తగిన భార్యగా అందరి ప్రశంసల్ని పొందిందంటే, ముఖ్యమైన కారణం ఆమె సాధు స్వభావం.

పదేళ్ళ వారి సంసార జీవితం, యే విధమైన ఒడుదుడుకుల్లేకుండా, సాఫీగా సాగిపోయింది.

అయితే, మనిషి యెప్పుడూ ఒకేలా వుంటాడని యెవ్వరూ చెప్పలేరు. వయస్సుతోపాటు, యెన్నో మంచివీ, చెడువీ మార్పులు వస్తుంటయ్. ఆ మార్పులు, మనిషి పెరిగే వాతావరణం మీద ఆధారపడి వుంటయ్.

"నీ స్నేహితుల గురించి చెప్పు.... నీ గురించి నేను చెబుతాను" అని ఓ ఇంగ్లీషు సామెత వుంది. హరి స్నేహితుల్లో, చెడు అలవాట్లు గల వ్యక్తులు కొత్తగా చేరారు. అక్కణ్ణించి ప్రారంభమయ్యింది, హరి సత్యం.

హరి, యిప్పుడు సిగరెట్లు తెగకాల్చి పారేస్తున్నాడు, ఖారా కిళ్ళీలు నమిలేస్తున్నాడు. అంతటితో ఆగితే, ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. త్రాగుడుకి అలవాటు పడ్డాడు. ఈ అలవాటుకి హరి యెట్లా దాసుడయ్యాడా అని, చాలా మంది ముక్కుమీద వేలేసుకున్నారు,

రోజులు గడుస్తున్నకొద్దీ, త్రాగుడు వ్యసనంతో హరి మరింత దిగజారి పోతున్నాడు. భర్త పతనమౌతున్నందుకు, సత్యవతి యెంతగానో పరితపించింది, ఎన్నోవిధాల చెప్పింది. కాని, ఫలితం లేకపోయింది. హరి, మౌనంగా వూరుకునే వాడే తప్పించి, సమాధానం చెప్పేవాడు కాదు. సత్యవతి, నిట్టూర్పు విడుస్తూ, తన దురదృష్టాన్ని తిట్టుకుంటూ. మౌనంగా యేడ్చేది—అంతకంటె ఆమె చెయ్యగలిగింది, ఏమీ లేదు గనక. అయితే, తన పిల్లల భవిష్యత్తు యెట్లా వుంటుందో నన్నది ఆమెను కల

పరపర్చింది. అంతర్గతంగా ఆమె అనుభ విస్తోన్న ఆవేదనని, యెవరితోనూ చెప్పు కోలేక పోయింది. ఈ పరిస్థితిలో, తలి దండ్రులు రమ్మని వుత్తరాలు రాసినా, వెళ్ళడం ఆమెకి మనస్కరించలేదు. అయోమయస్థితిలో కొట్టుమిట్టాడుతోంది, ఆమె మనస్సు.

*　　　*

ఎన్ని ఉత్తరాలు రాసినా, కూతురు రానందుకు, ఆమె తలిదండ్రులు ఆశ్చర్య పోయారు. ఆరాటం వాళ్ళని కదిలించింది అంచేత, తామే స్వయంగా వచ్చారు అల్లుడి ఇంటికి.

అకస్మాత్తుగ తలిదండ్రులు రావడం చూసి, విస్తుపోయింది సత్యవతి. కృత్రిమ మైన మందహాసంతో వాళ్ళను ఆహ్వా నించింది. అయితే నేం—ఆమె హృద యాంతరంగంలో పెను తుఫాను చెల రేగింది. ఇక్కడి పరిస్థితులు వాళ్ళకి అవగత మౌతాయేమోనని, ఆమె ఆరాట పడింది.

"అల్లుడు డ్యూటీకి వెళ్లాడా అమ్మా?" అన్నాడు, తండ్రి రామకృష్ణయ్య.

"ఔను నాన్నా!" ముక్తసరిగ అంది సత్యవతి.

మునుపటి వుత్సాహం కూతురి మొహంలో యెక్కడా కనుపించక పోవడం, ఆ తలిదండ్రుల్ని ఆశ్చర్య పర్చింది. మనిషి బాగా నీరసించినట్టు కూడా అగుపించింది.

"ఇలా చిక్కిపోయావేమిటమ్మా?" అంది సత్యవతి తల్లి కామాక్షి.

"అబ్బే! నేనెక్కడ చిక్కిపోయాను? బాగానే వున్నానమ్మా!" అంది సత్యవతి తెచ్చిపెట్టుకున్న మందహాసంతో.

"ఏవిటోనమ్మా, మాకేం అర్థం కావడం లేదు. నువ్వోసారి అద్దంలో మొహం చూసుకో—యెట్లా వున్నావో తెలుస్తుంది." అంది మళ్ళీ కామాక్షి.

సత్యవతి సమాధానం చెప్పకండా మొహం దించుకుంది.

"ఏవిటమ్మా, నిన్నూ, అల్లుణ్ణీ రమ్మని యెన్ని వుత్తరాలు రాసినా, యెప్పుడూ వీలుపడదన్న సమాధానమే రాస్తున్నావు? అసలు విషయం యేవిటి? పోనీ, ఆయన రావడానికి వీలుపడకపోతే నువ్వూ, పిల్లలూ రావొచ్చునుగా?" అన్నాడు రామకృష్ణయ్య.

"వస్తాం లెండి నాన్నా! దానికేముంది; లేవండి. భోజనం చేద్దురుగాని, తరువాత కాస్సేపు విశ్రాంతి తీసుకోపోతే యెలా?" అంది సత్యవతి, వాళ్ళ ప్రశ్నల్నించి తప్పించుకోడానికి ప్రయత్నిస్తూ.

"సరే: తరువాత మాట్లాడుకుందాం. లేవండి...." కామాక్షి అంది.

సత్యవతి, అక్కణ్ణించి వెళ్ళిపోయింది. ఆరోజు సాయంత్రం, భర్త యేస్థితిలో ఇల్లు చేరుకుంటారో నన్న ఆందోళన, ఆమెను యిప్పట్నించే కంగారు పరు స్తోంది. అయినా, ఆమెమాత్రం యేం

చెయ్యగలదు? భగవంతుడి మీద భారం వేసింది.

* *

సాయంత్రం ఏడుగంటలు దాటింది సమయం. హరి, యింకా ఇల్లు చేరుకో లేదు.

"అల్లుడు, యింకా రాలేదేవిఁటమ్మా!" అన్నాడు, రామకృష్ణయ్య.

సత్యవతి గుండెలు ఝల్లుమన్నయ్.

"వస్తారు లెండి నాన్నా! మీరు భోజనం చెయ్యండి" అంది.

"నాకేం తొందరలేదులే అమ్మా!" అంటూ క్షణం ఆగి, "అమ్మా సత్యవతీ, నువ్వేదో మానించి దాస్తున్నావమ్మా! నువ్వు అనుభవిస్తున్న యేదో ఆవేదన, నీకళ్ళల్లో కనిపిస్తోంది. నీ మొహంలో, మునుపటి వుత్సాహం అగుపించడంలేదు. ఈ ఇల్లంతా, దైన్యంతో నిండి వున్నట్టుంది. ఇదంతా చూస్తుంటే, వీటి వెనుక యేదో బలమైన కారణం వున్నట్టు తోస్తోందమ్మా! చెప్పమ్మా....నిజం చెప్పడానికి, నీ తలిదండ్రుల దగ్గర సంకోచం యెందుకు చెప్పు?" అన్నాడు. వుండబట్టలేక.

"ఔనమ్మా! చెప్పు....మాతో చెప్పడానికి సంకోచం యేవిఁటి? అల్లుడు మునుపటిలా లేడా! నిన్ను యాతన పెడుతున్నాడా!" అంది, కామాక్షి కూడా.

సత్యవతి నోట, మాటరాలేదు. ఎప్పటికయినా దాగని సత్యం, యెన్నాళ్లు దాయగలదు? ఆమెకి దుఃఖం పెల్లుబికింది. కళ్ళల్లో నీరు గిర్రున తిరిగింది. తాను అనుభవిస్తోన్న ఆవేదన చెప్పేయాలనుకుంది.

అంతలోనే, బైట తలుపు తట్టిన చప్పుడు వినిపించింది. సత్యవతి గుండెలు, గుభేలుమన్నయ్. ఆమె మొహం మ్లానమయ్యింది. తడబడే అడుగులు వేసుకుంటూ, వెళ్ళి తలుపు తెరిచింది.

హరి, మైకంలో తూలుతూవచ్చాడు.

"మా అమ్మా, నాన్నా. వచ్చారండీ!" అంది, రహస్యం చెబుతున్నంత మెల్లగా. సత్యవతి.

"దేవతలు దిగారన్న మాట.... రైట్!" అంటూ వాళ్లున్న గదిలోకి వచ్చాడు, హరి.

సత్యవతి, దిగులు పడిపోయింది తను భయపడినంతా అయినందుకు, తన దురదృష్టాన్ని మరింత తిట్టుకుంది. తలుపు గడియవేసి వచ్చింది. మొహమెత్తి, తలిదండ్రులు కేసి సూటిగ చూళ్ళేకపోయింది.

"హల్లో మైడియర్ మామగారూ, కుశలమేనా? ఏవండీ అత్తగారూ, మీ ఆరోగ్యం బావుందా? బావుంటుంది లెండి ....ఫరవాలేదు." అంటూ కుర్చీలో కూలబడి, బూటు విప్పుకుందుకు ప్రయత్నిస్తున్నాడు. సత్యవతి వచ్చి బూటు విప్పింది.

రామకృష్ణయ్య, కామాక్షీ, నీరైపోయారు. కూతురి నిర్లిప్తతకి అసలు కారణం యేవిఁటో, ఆమె తమ ఇంటికి

రాకపోవడానికి ఆటంకం యేవిఁటో, వారికి ఇప్పుడర్థమయ్యింది. వాళ్ళిద్దరూ పరస్పరం మొహాలు చూసుకొని, బరువుగా నిట్టూర్చారు. వారి కళ్ళల్లో అనుకోకండా నీరు చిమ్మింది.

"హరీ, యేవిఁటి బాబూ యిది? నువ్విలా తయారయ్యావంటే, నేను నమ్మలేకుండా వున్నాను.' వుండబట్టలేక అన్నాడు, రామకృష్ణయ్య.

హరి, చాలా తేలిగ్గా నవ్వేడు.

"ఎలా తయారయ్యాను. ఫస్టుక్లాసుగా వున్నానండీ! నాకేం! ....నన్నడిగితే, మీరే నీరసంగా వున్నారు. మీరూ కాస్త పుచ్చుకోంటి మామగారూ....ఉత్సాహం దానంతట అదే వస్తుంది.'' తడబడుతూనే అన్నాడు.

రామకృష్ణయ్యకి, కోపం వచ్చిందిగాని తమాయించుకున్నాడు. ఈ పరిస్థితుల్లో యేం మాట్లాడినా, లాభం లేదనిపించిందతనికి.

"అమ్మాయ్, భోజనాలు పెట్టమ్మా!'' విసుగ్గా అన్నాడు.

"మీరు భోంచేయండి మావఁగారూ! నేను, నాగదిలో భోంచేస్తాను. మరేం అనుకోకండేం....'' అంటూ పక్కగదిలోకి పోయాడు. హరి.

"చివరికి, నీ బ్రతుకు ఇట్లా తయారయ్యిందా అమ్మా!'' అన్నాడు రామకృష్ణయ్య, రుద్ధకంఠంతో.

సత్యవతి మాట్లాడలేదు. వస్తోన్న యేడుపుని ఆపుకుందుకు, విఫలప్రయత్నం చేస్తోంది.

రామకృష్ణయ్య, కాస్తంత దూరంలో నుంచుని, అమాయకంగా చూస్తోన్న మనుమల్ని చూశాడు, అతనికి ఏడుపొచ్చింది. చప్పున వెళ్ళి వాళ్ళని దగ్గరగా తీసుకున్నాడు. తండ్రి ఆలనా పాలనకి దూరమైన వాళ్ళని చూస్తుంటే, హృదయం తరుక్కుపోయింది.

సత్యవతి, వెక్కివెక్కి యేడుస్తూ, వంటగదికేసి వెళ్ళిపోయింది. కామాక్షి, కంట తడిపెట్టుకుంది.

"కామాక్షీ, నువ్వు వెళ్లు. అమ్మాయిని కనిపెట్టుకుని వుండు. రేపు, మనం అమ్మాయిని, పిల్లల్ని మనతోపాటు తీసుకుపోదాం. ఈ నరకంలో ఇంక ఒక్కక్షణం దాన్ని వుంచను....'' అన్నాడు, రామకృష్ణయ్య. అతనిలో వుక్రోషం వురకలు వేస్తుంటే, బలవంతంగా అణచుకున్నాడు.

కామాక్షి, కళ్ళొత్తుకుంటూ కూతురున్న చోటికి వెళ్ళిపోయింది.

* *

మరునటిరోజు, హరి మైకంలో లేడు గనుక, మామూలుగానే వున్నాడు. అయితే, అత్తా మావఁల్ని చూడ్డానికే మొహం చెల్లింది కాదతనికి.

రామకృష్ణయ్య, అల్లుడి గదిలోకి వెళ్లాడు, సవినయంగా లేచాడు హరి.

"కూచో బాబూ!'' తను కూచుంటూ




అన్నాడు రామకృష్ణయ్య.

హరి, మావఁగారికి అభిముఖంగా కూచున్నాడు. "చూడు బాబూ! మా వంశం యెటువంటిదో, నీకు తెలీంది కాదు. మీ వంశమూ అంతటిదే! అయితే, యీనాడు నువ్వు యిట్లా మారిపోయావంటే, అందుకు యెవర్ని నిందించాలో, అర్థంకాదు. చదువుకున్నవాడివి. నువ్వు చేస్తున్న తప్పును సరిదిద్దుకోగల పరిజ్ఞానం గలవాడివి. నీకు నేను చెప్పవల్సిన వాణ్ణికాదు. నీ స్వతంత్ర భావాలపై ఆధిక్యత చెలాయించడం కూడా నా అభిమతం కాదు. కాని, నీ మంచిని కోరడం, నా కర్తవ్యం. ఆది నావిధి. ఈ దురలవాటుకి నువ్వు దూరం కావడం, నీ భవిష్యత్తుకీ, నీ కుటుంబ శ్రేయస్సుకీ, చాలా అవసరం. ఇంతకంటె నేనేం చెప్పలేను. అమ్మాయినీ, పిల్లల్నీ, మాతోపాటు తీసుకు వెళ్లాలనుకుంటున్నాం. నువ్వు వస్తే, చాలా సంతోషిస్తాను.' అన్నాడు, రామకృష్ణయ్య.

హరి, త్రాగుడుకి అలవడ్డాడన్న మాటే గాని, సహజంగా దుర్మార్గుడు కాడు మావఁగారు చెప్పిన మాటలన్నీ వింటూ వుంటే, తను బాగా దిగజారిపోయినట్టనిపించింది. ఆ పరిస్థితిలో తాను వెళ్లడం, మంచిది కాదనుకున్నాడు.

"సత్యవతిని, పిల్లల్ని తీసుకెళ్లండి. వీలుచూచుకొని, నేనూ వస్తాను." సౌమ్యంగానే చెప్పాడు.

"సరే! నీ ఇష్టం...." అనేసి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు. రామకృష్ణయ్య.

సత్యవతి, తండ్రి నిర్ణయాన్ని విని, హర్షించలేకపోయింది.

''ఈ పరిస్థితుల్లో, నేను రాలేను నాన్నా! నేను లేకపోతే, ఆయనకి భోజన సదుపాయం వుండదు. అంతేకాదు, ఆయన మరింత విచ్చలవిడిగా తిరగడానికి అవకాశం యేర్పడుతుంది.'' అంది.

రామకృష్ణయ్య, బరువుగా ఓనిట్టూర్పు వదిలాడు.

''పిచ్చిదానా! ఆయన సుఖం కోరి, మంచిని కోరి, నువ్వు చెబుతున్నావు. కాని, అటువంటి బాధ్యత యేమీ అతడికి వున్నట్టు అగుపించదమ్మా! పోనీ, కొద్ది దినాలపాటు వుండి వద్దువుగానిలే.... ప్రయాణం కట్టు.'' అన్నాడు.

''ఔనమ్మా! వెళ్దామమ్మా! తాతగారింటికి వెళ్దాం ...'' అంటూ పిల్లలు ఒత్తిడి చేశారు.

సత్యవతి, మరేం అనలేకపోయింది. ఏమిటో, ఆమెకి భయంగానే వుంది.

''సరే నాన్నా! వారంరోజులు వుండి వచ్చేస్తాను'' అంది.

''అలాగేలే.''

* *

సత్యవతి, పిల్లలు, వెళ్ళిపోయాక, హరి ఒంటరివాడయ్యాడు. ఆ ఒంటరితనం, అతనికి మరింత స్వేచ్ఛనిచ్చింది. స్నేహబృందం, హరి ఇంట్లోనే మకాం పెట్టేశారు. మద్యపానం వారికి భోజనాన్ని మరిపించేంసిందంటే, అతిశయోక్తి కాదు.

రామకృష్ణయ్య, అల్లుడికి యెన్నో ఉత్తరాలు రాశాడు. కాని, హరినించి జవాబు లేదు, యే ఒక్కదానికీను. సత్యవతి కంగారు పడింది. వెళ్ళిపోతానంది. కాని, తలిదండ్రులు ఒప్పుకోలేదు. హరి, తన తప్పును తెలుసుకుని, సరిదిద్దుకుని వచ్చేవరకూ ఆ నరకంలోకి పంపమన్నారు.

''నా ఆరాటం మీకు తెలీదు నాన్నా! ఓసారి వెళ్ళాలి'' అంది సత్యవతి.

''ఆ వెళ్ళడమేదో నేనే వెళ్తానులే అమ్మా! పరిస్థితి చూసివస్తాను'' అన్నాడు రామకృష్ణయ్య.

సత్యవతి, మరేం మాట్లాడలేకపోయింది. మౌనంగా యేడ్చింది.

హరిని చూడ్డానికి వెళ్ళొచ్చిన రామకృష్ణయ్య, కోపంతో చిందులు తొక్కాడు.

''వాడు మనిషి కాదమ్మా! చదువుకున్న పశువు. ఇరవైనాలుగ్గంటలూ, ఆ స్నేహబృందంతో త్రాగుడు తప్పించి, మరో వ్యాపకం లేదు. ఆ ఇల్లు, ఇల్లులా లేదు. మరీ దిగజారిపోయాడమ్మా! ఇప్పుడు, నువ్వు యేం చెయ్యదల్చుకున్నావో చెప్పు. బాగా ఆలోచించి, ఒక నిర్ణయానికి రావడం మంచిది....''

సత్యవతి నీరైపోయింది. అనుకున్నంతా అయినందుకు కుమిలిపోయింది.

''చూడండి నాన్నా, నేను వచ్చేయడం వల్ల యెంతగా రెచ్చిపోయారో ఆయన!'' రుద్ధస్వరంతో అంది.

బరువుగా ఓ నిట్టూర్పు విడిచాడు.

రామకృష్ణయ్య.

"అది నీ భ్రమ తల్లీ! నువ్వు అక్కడ వుండీ చేయగలిగిందేమీ లేదు" అన్నాడు.

"ఇన్నాళ్ళు వుండి, యేం చెయ్య గలిగావు ?"

"ఏమైనా నాన్నా. నేను ఆయనదగ్గర వుండడమే శ్రేయస్కరం. ఇంక వుపే క్షించలేను. రేపే వెళ్ళిపోతాన్నాన్నా!" అంది.

"చూస్తూ, చూస్తూ, నిన్ను అక్కడికి యెలా పంపించేదమ్మా ? హరిలో కొంత యినా మార్పు రానీయ్...." అన్నాడు.

"ఆయన ఒంటరిగా వుంటే, మార్పు రావడం అసంభవం నాన్నా!" అంది, నిరుత్సాహంగా సత్యవతి.

కామాక్షి అందుకుంది. కూతురి పరి స్థితికి, మరీ జాలిపడిందామె.

"ఔనండీ! అమ్మాయి చెప్పింది కూడా సబబుగానే వున్నట్టుంది" అంది, కూతుర్ని సమర్థిస్తూ.

రామకృష్ణయ్య పట్టుదల, కొ స్తంత సడలింది. తను యింకా మొండిపట్టు పట్టుక్కూర్చోవడంలో అర్థం లేదని పించింది.

"సరే! నీ యిష్టమమ్మా! రేపే బైలు దేరు" అనేశాడేగాని, అతనికి మాత్రం యేమాత్రం యిష్టంలేదు.

సత్యవతి తృప్తిగ నిట్టూర్చింది.

* *

ఆరోజు సాయంత్రం సత్యవతి పెట్టె సర్దుకుంది. అక్కడికి వెళ్ళిన వెంటనే యే ఇబ్బందీ లేకుండా, కొన్ని వంట దినుసులుకూడా వేరేగా పట్టుకుంది.

అయితే, విధిరాత వేరుగా వుంది. రాత్రి తొమ్మిదిగంటలకు ఓ టెలిగ్రామ్ వచ్చింది. రామకృష్ణయ్య, దాన్ని ఆత్రంగా అందుకుని చదివాడు.

"హరి....ఎక్స్‌పైర్డ్ యిన్ యాక్సి డెంట్...." అని వుంది అందులో.

రామకృష్ణయ్యకి గుండె ఆగిపోయిన ట్టనిపించింది. కూతురికి యెట్లా ఆ విష యం చెప్పడమో అర్థం కాలేదు. అతని చూపులు అయోమయంగా కూతురికేసి ప్రసరించినయ్.

"ఎక్కణ్ణించి నాన్నా ఆ టెలిగ్రామ్?" అంది సత్యవతి ఆరాటంతో

రామకృష్ణయ్య, కూతురికేసి చూడలేక పోయాడు. అతని కళ్ళనించి, బొటబొటా అశ్రువులు జాలువారినయ్. దుఃఖాన్ని ఆపుకోలేక, కన్నీరొత్తుకుంటూ, టెలి గ్రామ్‌ని ఆమె చేతికి అందించాడు. అక్క డింక నిలబడలేక పోయాడు కుర్చీలో మొదలుతెగిన వృక్షంలా కూలిపోయాడు.

సత్యవతి టెలిగ్రామ్ చదువుకుంది. ఆమెకి తన ముందున్న ప్రపంచం చీకటి మయంగా అగుపించింది.

"నాన్నా! భగవంతుడు నాకు అన్యా యం చేశాడు నాన్నా!" భోరున యేడుస్తూ అంది, గుండెలు అవిసిపోయేలా విల పించింది. పిల్లల్ని హృదయానికి హత్తు

కుని యేడుస్తుంటే, ఆ పసివాళ్ళుకూడా యేడుపు లంకించుకున్నారు.

కామాక్షి, భర్తద్వారా విషయాన్ని తెలుసుకుని కుమిలిపోయింది. కూతుర్ని పొదివిపట్టుకుని ఓదార్చడానికి ప్రయత్నించింది.

"నీ విషయంలో భగవంతుడు నిర్దయుడైపోయాడమ్మా! ఎంతో మంచివాడనిపించుకున్న హరి యిట్లా యీ త్రాగుడు వ్యసనానికి దాసుడవుతాడని, చివరికి దానివల్లనే మృత్యువాత పడతాడని యెవరూహించారు? విధిరాత అట్లావుంది మరి! నువ్వు యెంత యేడ్చినా లాభమేవిఁటి?" అంది కామాక్షి.

రామకృష్ణయ్య అసలు మాట్లాడలేకపోయాడు. అమ్మాయిని త్వరగా పంపించకపోవడంలో, తనే పొరపాటు చేశాడేమోనని బాధపడ్డాడు. అయినా, హరికి మరణం రాసిపెట్టి వుంటే, సత్యవతి యెక్కడ వున్నా తప్పదని సమాధానపడ్డాడు తనలో తనే!

సత్యవతి తన దురదృష్టాన్ని తిట్టుకుంది. ఆమె తనలో తనే ప్రశ్నించుకుంది. ఈనాటి తన పరిస్థితికి బాధ్యులెవరు? భర్తా?....తలిదండ్రులా?....లేక తనేనా? తలిదండ్రులెలా బాధ్యులవుతారు? ఆయన్ని ఒక త్రోవలోకి తీసుకురావడానికి ప్రయత్నించారు .... ఇహ తనుమాత్రం యేం చెయ్యగలదు? ఆయన్ని ఆ దురలవాటునించి దూరంగా వుంచడానికి యెన్నో విధాల ప్రయత్నించి విఫలురాలైంది. అయితే యెవరు బాధ్యులు?....ఆయన పతనానికి ఆయనే బాధ్యులు. ఈనాడు తను యీ స్థితిలో వుండడానికి బాధ్యులు ఆయనే! చదువు, సంస్కారం వుండీ కూడా ఆయన పతనమయ్యారు. తన పసుపు కుంకుమను తుడిచేశారు....పిల్లల్ని అనాధల్ని చేశారు...."భగవాన్! ఇదంతా నా పూర్వజన్మ పాపఫలమా?" అనుకుంటూ వాపోయింది సత్యవతి.

ఆ రాత్రే వాళ్ళంతా ప్రయాణం కట్టారు. సత్యవతికి ఆ భయంకరమైన రాత్రిలా భవిష్యత్తూ అగుపించింది పాపం!

